# నేనా గీతాన్ని పాడను!



■ గోపరాజు నాగేశ్వరరావు

నిజానికి రామ్మూర్తి మంచివాడే! కానీ, వాడికున్నంత చెడు పేరు చెడిపోయిన వాళ్ళెవ్వరికీ లేదు... మాటతీరు కర్కశంగా వుంటుంది. తల బిరుసుతనమో, ముక్కుసూటి తనమో తెలియదు గానీ వాడి మాటల్లో 'సౌమ్యత' అన్నదే కనిపించదు- కలికానిక్కూడా...

ఉదాహరణకు బంధువులెవరైనా ఇంటికి వస్తే సాదరంగానే ఆహ్వానిస్తాడు. యోగక్షేమాలు విచారిస్తాడు. అవసరమైన సందర్భాల్లో సలహాలూ ఇస్తాడు. ''ఇక భోజనానికి లేవండి''అని ఎంతో ప్రేమగా అడుగుతాడు.

అడిగిందే తడవుగా ఎవ్వరూ లేచి కాళ్ళు కడుక్కొని ''భోజనాలు వడ్డించండి'' అని పీటల మీద కూర్చోరు. ఆకలి చూపులు చూస్తూనే ''భోజనమా! ఇప్పుడేం భోజనం! బస్టాండ్లో దిగ్గానే క్యాంటిన్లో చపాతీ తిన్నాను'' అని ఒకడూ; ''భోంచేసే టైం లేదు... త్వరగా వెళ్ళాలి. పైగా ఆకల్లేదు... అదీగాక ముందుగా తెలియకండా వచ్చిన వాళ్ళంకదా! మాకోసం యిప్పుడు కూరలూ, నారలూ చెయ్యాలంటే అమ్మాయికి ఎంత కష్టం...''అని 'అమ్మాయి లేచి వెళ్ళి పొయ్యి వెలిగిస్తే బావుండు' అనుకొంటూ ఆశగా చూస్తాడింకొకడు.

అలాంటి సందర్భాల్లో రామ్మూర్తి ఎంతమాత్రం తడుముకోకండా ''మీరు క్యాంటిన్లో చపాతీ తిన్నారు గనుక ఇక భోజనం చెయ్యలేరు... ఇక మీరు భోంచేసే టైం లేదన్నారు గనుక త్వరగా బయల్దేరి వెళ్ళండి... ప్రొద్దుపోతున్నది... అమ్మాయికిప్పుడు వంట పని పురమాయించి కష్టపెట్టవద్దన్నారు గనుక అలాగే చేద్దాం! నా భార్య విశ్రాంతి తీసుకుంటుంది గానీ పొయ్యి వెలిగించదని హామీ ఇస్తున్నాను'' అని, ''ఇంకా ఏమిటి విశేషాలూ?'' అని తాపీగా అడుగుతాడు.

ఇక తప్పనిసరై ఆకలి కడుపులతో వెళ్ళిపోయిన బంధువులు తమకు జరిగిన 'అమర్యాద'కు చిలవలు పలవలు కల్పించి ప్రచారం చేస్తారు. రామ్మూర్తినోవిలన్లా చూపిస్తారు.

''అలా మాట్లాట్టం తప్పుకదా రామ్మూర్తీ?'' అని ఆత్మీయంగా ఎవరైనా అడిగితే వాడు కించిత్తు విషాదంగా నవ్వి చెప్పే సమాధానం ఒకటే! ''భోజనాలు త్వరగా వడ్డించండి''అని స్వతంత్రంగా అడిగే వాళ్ళంటే నాకు అభిమానం.

అదీకాకండా నేరుగా వంట గదిలోకి వెళ్ళి కావాల్సినవి కంచాల్లో పెట్టుకొని సొంత మనుషుల్లా తింటూ ఎదరగా వచ్చి, కూర్చునే వాళ్ళంటే పరమ సంతోషం... కానీ ఇలాంటి వాళ్ళంటేనే నాకు చిరాకు. 'ఇబ్బంది పెట్టమనీ... ఆకలిగా లేదనీ... అర్జంటు పనివుంది వెళ్ళాలనీ...' భేషజాలకు వెళ్ళేవాళ్ళను ఆకలి కడుపులతోనే పంపించాలనిపిస్తుంది నాకు... వాళ్ళ హిపోక్రసీకి నా ఒళ్ళు మండిపోతుంది. ఏం చేస్తాం?'' అని గలగలా నవ్వుతాడు రామ్మూర్తి.

అంతదాకా ఎందుకూ! రెవిన్యూ శాఖలో ఉద్యోగం వెలగబెడుతున్న రామ్మూర్తి ఇంతవరకూ సర్వీసునుంచి నాలుగుసార్లు సస్పెండయ్యాడు. ఎంక్వయిరీలో వాడి తప్పేమీలేదని తేలటంతో నాలుగుసార్లూ రీయిన్స్టేట్ అయ్యాడు... అయినా ఇంకా వాడు తన విధివిధానాలే మార్చుకోలేదంటే 'జన జీవన స్రవంతికి' దూరంగా వుంటాడే తప్ప 'జనగణమన అధినాయక జయహే...' జీవన స్రవంతిలోకి చస్తే యిక రాడు! స్వతంత్ర భారతదేశం వాడికి పట్టదు!!

ఇంతకూ రామ్మూర్తి యిప్పుడు నాకెందుకు గుర్తొచ్చాడో చెప్పలేదు కదూ?

మండల్ రెవిన్యూ ఆఫీసరు ఫిర్యాదుమీద పోలీసువారు వాడ్ని అరెస్టుచేసి అనంతరం బెయిలు మీద విడుదల చేసారట... జాతీయ గీతాన్ని అవహేళన చేసినట్టు వాడిమీద నేరం మోపారుట!

ఆ విషయం తెలిసాక నాకు రామ్మూర్తిని చూడాలనిపించింది. ఏం జరిగిందో వాడ్నే అడిగి తెలుసుకోవాలనీ, ఒకవేళ వాడిదే తప్పయితే మందలించాలనీ అనిపించింది... ఎవరు వాడి మీద ఎన్ని చెప్పినా యింకా వాడంటే నాకు అభిమానమే! ఆ అభిమానమే నన్ను కదిలించింది.

వాడి ఇంటికి బయల్దేరి వెళ్ళాను...

❋ ❋ ❋

రామ్మూర్తి ఇల్లు అల్లంత దూరాన వుందనగానే నాకు దారిలో సాంబయ్య కనిపించాడు! అతనూ ఎం.ఆర్.ఓ ఆఫీసులోనే ఉద్యోగం చేస్తాడు. రామ్మూర్తికి బాగా పరిచయం...

సాంబయ్యను కదిలిస్తే సమాచారం తెలుస్తుంది... అసలికి ఏమి జరిగిందో? ఎంఆర్వో రామ్మూర్తిని ఎందుకు సస్పెండు చేయించి అంతకూ కోపం చల్లారక పోలీసు రిపోర్టు కూడా యిచ్చాడో తెలుసుకొంటే ఆ తర్వాత అలా ఎందుకు జరిగిందో రామ్మూర్తినే అడిగి తెలుసుకోవచ్చు...

అలాంటి ఆలోచన వచ్చిందే తడవుగా ''సాంబయ్యగారూ...!'' అని పెద్దగా పిల్చాను... రోడ్డు అవతలి అంచు వెంట తల వంచుకొని వెళ్తున్న సాంబయ్య నా పిలుపు విని ఆగాడు. తలెత్తి చూసేడు. నన్ను పోల్చుకొని మొహంనిండా నవ్వులు పులుముకొంటూ నా దగ్గరికి వచ్చి ''బాగున్నారా?'' అని పలుకరించాడు.

''నేను బాగానే వున్నాను గానీ మన రామ్మూర్తి పరిస్థితే బాగాలేదని తెలిసింది. అది నిజమేనా? ఇంతకూ అసలేం జరిగింది?'' అని సాంబయ్యను అడిగాను.

సాంబయ్య ''ప్చ్...''అని పెదాలతో అదోలా శబ్దం చేసాడు... ఆ శబ్దంలో ఎంతో నిరాశ ధ్వనించింది. ఒక్క క్షణం తల పంకించి ఆగి-

''పోనివ్వండి సార్...! ఇక రామ్మూర్తిగార్ని గురించి మనం ఆలోచించటం అనవసరం. చేదు అనుభవాలతో తల బొప్పులు కడుతూన్నా ఆయనగారి తీరే మారదు... బండవాడ్నయితే జ్ఞానం చెప్పి దారి మార్చవచ్చుగానీ మొండివాడ్ని ఎలా మార్చగలం?'' అని ఎంతో తాత్త్వికంగా నవ్వాడు సాంబయ్య.

''ఇంతకూ జరిగిందేమిటి? రామ్మూర్తిచేసిన నేరం ఏమిటి?'' అడిగాను.

''జమ-ఖర్చుల చిట్టాలో జన్మభూమి నిధులను గోల్‌మాల్ చేసి అంకెల్ని తారుమారు చేయించాట్ట ఎంఆర్వో. అయినా ఆ విషయం చూసుకొందుకు పై అధికార్లున్నారు. ప్రభుత్వం వుంది. అవినీతి నిరోధక శాఖ వుంది. చట్టం వుంది...

''పోనివ్వండి సార్...! ఇక రామ్మూర్తిగార్ని గురించి మనం ఆలోచించటం అనవసరం. చేదు అనుభవాలతో తల బొప్పులు కడుతూన్నా ఆయనగారి తీరే మారదు... బండవాడ్నయితే జ్ఞానం చెప్పి దారి మార్చవచ్చుగానీ మొండి వాడ్ని ఎలా మార్చగలం?''

'కందకు లేని దురద కత్తిపీటకెందుకూ?'అన్నట్టు ఆ అవినీతిని గురించి రామ్మూర్తిగారికెందుకట? ఎంఆర్వోను ఆఫీసులోనే నిలదీసి అడిగాడు... 'ఆడిట్' వాళ్ళకు అడ్డమైన గడ్డి తినిపించి పద్దులు 'ఓ.కే' చేయించినా, చేసిన 'పాపం పద్దుకు' ఆడిట్ చేసి నికరంగా లెక్క తేల్చే జనం నిద్ర లేచి వస్తారన్న ఆశాభావాన్ని కూడా అందరి ముందూ వ్యక్తం చేసారాయన..."

"అప్పుడేం జరిగింది?" ఆసక్తిగా అడిగాను.

"ఎంఆర్వోకు వళ్ళు మండింది... పిపీలికానికెందుకు ప్రపంచం గోల అనుకున్నారో యేమో, అమాంతం రామ్మూర్తిగార్ని నలుగురి ముందూ నానా తిట్లూ తిట్టారు... నాశనం చేస్తాననీ, విధుల నిర్వహణ 'అణకువగా' చెయ్యకపోతే ఉద్యోగం ఊడగొట్టి శంకరగిరి మాన్యాలు పట్టిస్తాననీ హెచ్చరించి వదిలారు..."

"తర్వాత ఏం జరిగింది?"

"ఆగస్టు పదిహేను రానే వచ్చింది."

"ఐతే...?"

"స్వాతంత్ర్యం వచ్చిన దినం కదా అది! జాతీయ పతాకాన్ని ఎంఆర్వో కార్యాలయం ముందు ఎగురవెయ్యటం... అందుబాట్లో వున్న అందరికీ చాక్లెట్లు పంచటం... ఉపన్యాసాలూ... స్వతంత్ర భారత్‌కూ జై 'బోల్'లూ... యధావిధిగా జరిగిపోవాలి కదా!

అరేంజిమెంట్లన్నీ జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎంఎల్లే కూడా వొచ్చాడు. మున్సిపల్ ఛైర్‌పర్సనూ... ఇంకా చాలా మంది వి.ఐ.పీలూ హాజరయ్యారు. కార్యక్రమానికి రంగం అంతా సిద్ధమైంది.

రామ్మూర్తిగారలా జన్మభూమి నిధుల విషయంలో తనను అందరిముందూ విమర్శించటం, నిధుల గోల్‌మాల్ విషయం రచ్చకెక్కించటమూ ఇంకా 'వాతం'లా ఎంఆర్వోగారి కడుపులో తెముల్తూనే వుంది... రామ్మూర్తిగారి మీద పగ తీర్చుకోటానికి అదే అదనుగా భావించటం కూడా జరిగింది..."

"ఎలా...?" అని అడుగుతూ ఉత్సాహం పట్టలేక మరి కొంచెం ముందుకు జరిగి సాంబయ్యను అడిగాను.

"ఒక్క ఎంఆర్వోగారికే కాదు, ఊర్లో అందరికీ తెలుసు.- రామ్మూర్తిగారికి మన జాతీయ గీతం అంటే పరమ చిరాకు అని... చస్తే అతగాడా గీతాన్ని పాడడు. ఎవరైనా పాడితే వింటూ అక్కడ ఉండడు. ఆగ్రహంతో కంపించిపోతూ దూరంగా వెళ్ళిపోతాడే గానీ జాతీయ గీతం వినాలంటే చెవిల్లో సీసమైనా పోసుకుంటాడే తప్ప సి.ఆర్.పి. పోలీసులచేత కొట్టించి వినిపించాలన్నా వినడు! తన్నులైనా తింటాడు గానీ తలకాయ వంచడు!!

ఆ విషయం ఎమ్మార్వోకి బాగా తెలుసు. జండా వందనానికి ఎంఎల్లేతో సహా వి.ఐ.పిలు చాలామంది వస్తున్నారు. వాళ్ళందరి సమక్షంలో జాతీయ గీతం ఆలపించే బాధ్యత రామ్మూర్తికే అప్పగించి అతగాడ్ని యిరకాటంలో పెట్టాలనుకున్నాడు.

రామ్మూర్తిగారి నైజం తెలిసిందే కదా! తప్పకుండా ఆయన మొండిగానే ప్రవర్తిస్తాడనీ, జాతీయ గీతం పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తాడనీ ఊహించాడు ఎంఆర్వో... అలా జరిగితే రామ్మూర్తిమీద వి.ఐ.పిల సాక్షిగా పగ తీర్చుకోవాలన్నదే ఆయనగారి అభిమతం. ఆ ట్రాప్‌లో యిరుక్కుపోయారు రామ్మూర్తి" చెప్పాడు సాంబయ్య.

"ఎలా యిరుక్కుపోయాడూ? జాతీయ గీతం పాడలేదా?" అడిగాను.

"పాడలేనంటే పేచీ వుండేది కాదు... పాడనన్నారు. పైగా ఆ గీతాన్ని దేశభక్తి వున్నవాడెవ్వడూ పాడడని అవాకులూ చవాకులూ ప్రేలారు. ఆ ప్రేలాపన్ను అందరూ విన్నారు. విఐపిల సమక్షంలోనే అంతా జరిగింది. అందరూ రామ్మూర్తిగార్ని ఆల్‌ఖైదా తీవ్రవాదిని చూసినట్టే చూసారు. దానికితోడు ఎంఆర్ఓ అందరికీ రామ్మూర్తిగారికి వ్యతిరేకంగా పురి ఎక్కించారు. అది చివరికి పోలీసు కేసు దాకా వెళ్ళింది. సస్పెన్షన్ వేటు కూడా పడింది..."

"ఎందుకలా ప్రవర్తించాడు రామ్మూర్తి?" ఆశ్చర్యపోయాను.

"అంతటితో సరా...! అమాంతం మైకు దగ్గరికి వెళ్ళారు. తనను జాతీయ గీతం పాడేందుకు వేదిక మీదికి పిలిచిన ఎంఆర్వో మొహం వేపుకు చెయ్యి చాపి,- ఎగతాళిగా నవ్వుతూ-

'జాతీయ గీతంతో నీకెందుకు బాసూ
నీ దేశభక్తి నాటకమే ఒక ట్రాషు
మింగింది కక్కు జన్మభూమి క్యాషూ
నటనలు ఆపితే అది చాలా భేషు' అని

ఒక గేయాన్నికూడా పెద్దగా చదివి వినిపించి వెళ్ళారు. దాంతో పరిస్థితి చెయ్యి దాటి పోయింది. ఎవ్వరూ యిక రామ్మూర్తిగార్ని రక్షించలేరేమో..." అని భారంగా నిట్టూర్చాడు సాంబయ్య.

సాంబయ్యతో యిక మాట్లాడేదేమీ లేదు. విషయం అంతా వివరంగానే చెప్పాడు. "సరే... సాంబయ్యా! అలా వెళ్ళి ఒకసారి రామ్మూర్తిని పలుకరించి వెళ్తాను" అని వెళ్ళిపోయాను. రామ్మూర్తి ఇంటికి చేరుకున్నాను.

❊ ❊ ❊

నేను వెళ్ళేసరికి రామ్మూర్తి వరండాలోనే వాలు కుర్చీలో కనిపించాడు. నన్ను చూసి చిర్నవ్వు నవ్వుతూ "కూర్చోండి"అన్నాడు.

అతని ఎదరగా కుర్చీలో కూర్చొని పరీక్షగా అతనివైపు చూసాను. కళ్ళు లోతుకు పీక్కుపోయి మొహంబాగా వాడిపోయి కనిపించాడు రామ్మూర్తి. మనిషి చాలా అసహనంగానూ వున్నాడు.

"ఏమిటి విశేషాలూ?" ఏమీ ఎరుగనట్టే రామ్మూర్తిని అడిగాను.

"మన జాతీయ గీతాన్ని బేన్ చెయ్యాలి" అన్నాడు సూటిగా.

నా వళ్ళు జల్దరించింది! శతకోటి మంది భారతీయులు అమితంగా అభిమానించే జాతీయ గీతాన్ని బేన్ చెయ్యాలంటాడేంటి రామ్మూర్తి? "రామ్మూర్తిగారూ...! మరేమీ అనుకోనంటే నాదో చిన్న సందేహం..."

"ఏమిటండీ?" అడిగాడు రామ్మూర్తి.

"ఇంతకూ మీకు దేశభక్తి వున్నట్టా? లేనట్టా?"

"ఉన్నది... ఉంది గనుకనే జాతీయ గీతాన్ని బేన్ చెయ్యాలన్నాను" అని నావైపు గర్వంగా చూసేడు రామ్మూర్తి.

"విశ్వకవి విరచించి జాతికి అంకితమిచ్చిన ఓ మహోన్నత గీతాన్ని బేన్ చెయ్యాలనటం దేశభక్తి అవుతుందా?" అడిగాను... కోపంతో నా గొంతు సన్నగా కంపించింది కూడా!

రామ్మూర్తి నాలో వచ్చిన మార్పును గమనించకపోలేదు. అయినా ఎంతో శాంతంగా స్థితప్రజ్ఞుడికిమల్లేనే నవ్వాడు.

"నీ నవ్వుకు అర్థం ఏమిటి?" అడిగాను.

"విశ్వకవి రవీంద్రుడి చిత్తశుద్ధిని గానీ, జాతీయ గీతానికి వున్న ఔన్నత్యాన్ని గానీ నేను శంకించటంలేదు..."

"మరి బేన్ చెయ్యాలని ఎలా అన్నావ్?"

"మన జాతీయ గీతం ఆ కాలానికి నప్పింది గానీ యిప్పుడు నప్పదు..."

"ఎందుకూ?"

"ఉదాహరణకు పల్నాటి బ్రహ్మనాయుడు పెట్టిన 'చాపకూడు' ఉదంతాన్నే తీసుకుందాం! కుల వివక్ష వెర్రితలలు వేస్తున్న ఆ కాలంలో బ్రహ్మనాయుడు చేపట్టిన ఆ చర్య విప్లవాత్మకమైంది.. చరిత్రకెక్కింది. కానీ యిప్పుడు అదే ఆదర్శంగా దళితులను కుర్చీల్లోనుంచి దించి నేల మీద చాపలు పరచి చాపకూడు పెడతామంటే ఎలా? బ్రహ్మనాయుడి కాలంలో 'విప్లవాత్మక చర్య' అనిపించుకున్నదే ఇప్పుడు ఆచరిస్తే అభివృద్ధి నిరోధక చర్య అవుతుంది... అలాగే జాతీయ గీతం కూడా..." అన్నాడు రామ్మూర్తి నావైపు సూటిగా చూస్తూ.

"నా సందేహాలింకా పూర్తిగా తొలగిపోలేదు. బ్రహ్మనాయుడి చాప కూటికీ, భారత జాతీయ గీతాన్ని బేన్ చెయ్యాలనటానికీ ఏమిటి సంబంధం?" ప్రశ్నార్థకంగా రామ్మూర్తి వైపు చూస్తూ అడిగాను.

"ఇంకా అర్థం కాలేదా?" అని అదోలా నవ్వాడు రామ్మూర్తి. "మన పొరుగు దేశమైన పాకిస్తాన్ తీవ్రవాదుల సహకారంతో భారతదేశంలో నరమేధం కొనసాగిస్తున్నది. నిన్నమొన్నటిదాకా సరిహద్దుల్లో కాల్పులు జరగని రోజంటూ లేదు. కాశ్మీర్ను రావణకాష్టంలా రగులుస్తూనే వున్నారు. ప్రజలను ఊచకోత కోస్తున్నారు.

భారతదేశపు ఆర్థిక వ్యవస్థను కూడా అతలాకుతలం చెయ్యటానికి కుట్ర పన్నారు. దొంగ నోట్లు ముద్రించి మన దేశంలో చలామణికి తెచ్చారు... ఇదంతా నిజం కాదంటారా? పాకిస్తాన్ మన పతనాన్ని కోరుకోవటం లేదంటారా?"

"అది నిజమే! అయినా గానీ, పాకిస్తాన్ కుట్రలకూ విశ్వకవి రవీంద్రుడి జాతీయ గీతాన్ని బేన్ చెయ్యటానికీ ఏమిటి సంబంధం?"

"బ్రహ్మనాయుడి చాపకూటి సిద్ధాంతానికి యిప్పుడు కాలం చెల్లినట్టే మన జాతీయ గీతానిక్కూడా కాలం చెల్లిపోయింది. కాలాన్ని ప్రమాణంగా తీసికొని దాన్నిప్పుడు తిరగరాయాలి.. కొత్త జాతీయ గీతాన్ని రూపొందించాలి.

పాకిస్తాన్ కూడా భారతదేశంలోని భాగంగానే ఉన్న కాలంలో రచించిన గీతం అది... ఒకవైపు మన దేశం మీద పాకిస్తాన్ కయ్యానికి కాలు దువ్వుతూంటే మరోవైపు మనం 'పంజాబు, సింధు, గుజరాత్, మరాఠా...' అంటూ కొన్ని పాకిస్తాన్ భూభాగాలను కూడా కలుపుకొని గీతం ద్వారా కీర్తించటం... ఆ గీతాన్నే భారత జాతీయ గీతంగా కొనసాగించటం సుతరామూ ఇష్టం లేదు నాకు. అందుకే ఆ గీతాన్ని పాడను... వినను. అంతా విని కూడా యింకా మీరు నాదే తప్పంటారా?" అని అడిగాడు రామ్మూర్తి.

నా నోటివెంట మాటలు పెగల్లేదు. మౌనంగా తల దించుకున్నాను... ఇంతకూ రామ్మూర్తి అడిగిందానికి ఏమని సమాధానం చెప్పనూ?

★

"బ్రహ్మనాయుడి చాపకూటి సిద్ధాంతానికి యిప్పుడు కాలం చెల్లినట్టే మన జాతీయ గీతానిక్కూడా కాలం చెల్లిపోయింది. కాలాన్ని ప్రమాణంగా తీసికొని దాన్నిప్పుడు తిరగరాయాలి.. కొత్త జాతీయ గీతాన్ని రూపొందించాలి.